# కుసుమ హృదయం

"నా గురించి ఆలోచించకండి.

జానకికి పెళ్ళి చేసేయండి" అంటుంది కుసుమ.

"నీకు పెళ్ళి కాకుండా, నీ చెల్లెలికి పెళ్ళా? వీల్లేదు. వీల్లేదంటే వీల్లేదు" అంటాడు మొండిగా కుసుమ తండ్రి.

"పెద్దదానికి పెళ్ళిరాత లేకుండా చేశాడు మాయదారి దేవుడు. మీరు రెండోదానికి పెళ్ళి కాకుండా వచ్చే సంబంధాన్ని తిరగ్గొడుతున్నారు. అలా తిరగ్గొట్టి రెండోదానికి కూడా మొగుడు రాకుండా చేయండి. అంతా నా ఖర్మ!" నెత్తి కొట్టుకుంటుంది కుసుమ తల్లి.

ఏమంటే కుసుమ కుంటిది. కుంటిదానికి మొగుడెవడొస్తాడు.

దానికి మొగుడు రావడం లేదని రెండోదానికి మొగుడక్కర్లేదా?

ఇలా ఆలస్యం చేస్తే రెండోది ముదిరి పోతుంది. ముసిల్ది అయి పోతుంది.

ముసిల్దానికి మొగుడెవడొస్తాడు?

ముసిలమ్మలకు మొగుళ్ళు ఫారిన్‌లో రావచ్చు. కాని, ఇండియాలో రారు. ఆంధ్ర దేశంలో అసలు రారు.

రాకపోతే మరేం ఇబ్బంది లేదు కాని, ఇంకా జానకి ముసిల్ది కాలేదు. కుసుమ కూడా ముసిల్ది కాలేదు.

కుసుమ జానకికన్నా మూడేళ్ళు పెద్దది. కుసుమ వయసు ఇరవై మూడు సంవత్సరాలు మాత్రమే.

కుసుమ కొంతలో కొంత అందంగానే ఉంటుంది. కొంతలో కొంత చదువు కూడా నేర్చుకుంది. — మెట్రిక్ వరకూ. కాని, ఏం లాభం?

ఒక కాలు లేదు --- మోకాలు దాకానే ఉంది.

కాళ్ళు లేని దానికి పెళ్ళి కాదు!

అయితే కన్నూ, కాలూ లేకపోయినా డబ్బు మటుకు ఉంటే--- పెళ్ళి చేసుకోవడానికి ముందు కొచ్చే మంచి వాళ్ళున్నారు. కాని, కుసుమకు కాలుతోపాటు డబ్బుకూడా లేదు. అందుచేత ఆ 'మంచివాళ్ళు' ఆమె దగ్గిరేం వస్తారు?

అసలు పేద కొంపలో పుట్టిన ఆడపిల్ల అందంగాపుట్టినా, మొగుణ్ణి సంపాదించాలంటే మూడు చెరువుల నీళ్ళు తాగవలసి వస్తోంది. అలాంటప్పుడు ఆ కుంటి దానికి — కుంటి బీద దానికి— ఎన్ని చెరువుల నీళ్ళుతాగితే మటుకు మొగుడొస్తాడు!

కాళ్ళు లేని దానికి పెళ్ళి కూడదు. కోర్కెలుండగూడదు. ఆశలు పెంచుకో కూడదు.

కుంటిదాన్ని మనిషిగా చూడకూడదు.

కుంటిది మనిషి కాదు.

కుసుమ మనిషి కాదు.

"నేనెందుకు మనిషిని కాను? కుసుమను ఎళ్ళవేళలా వేధించే ప్రశ్న అనుక్షణం బాధించే ప్రశ్న.

"నేను మనిషిని." మొండిగా, కసిగా, జవాబుగా అనుకుంటుంది.

ఆ జవాబు తనకు తానే అనుకోవడం వల్ల తృప్తి కలగక కళ్ళంట నీళ్ళొస్తాయి.

తనని తను కాకుండా మరెవరో--- 'నీవూ మనిషివే' అనాలి అనడం కాదు, మనిషిగా చూడాలి.

అలాంటి మనుషులు ఆమెకీ ప్రపంచంలో కానరారాయె!

అలాంటి మనుషులు కానరాని ప్రపంచంమీద ఆమెకు కసిగా ఉంది. మంటగా ఉంది. ఆ లోకానికి నిప్పెట్టేయాలనుంది. ఆ నిప్పుల్లో తను కూడా మాడి మసై పోవాలనుంది. నూతిలోదూకి ఆ నీళ్ళెవరూ తాగడానికి

పనికిరాకుండా చేయాలనుంది. అందరి కళ్ళూ పీకేయాలనుంది. అందరి కాళ్ళూ నరికేయాలనుంది.

తను అంత పనే చేస్తే ముందు రమణమ్మ కాలు నరుకుతుంది. అది ఖాయం.

దానికి అందం, డబ్బూ ఉన్నాయని అహంకారం. యూనివర్సిటీలో చదువుతోందని పెద్ద గర్వం. దాని కంటికి తను పెంట కుప్ప. చెత్త డబ్బా.

దానికి తనంటే చిన్నప్పటి నుంచీ అదే చిన్న చూపు. దానిది తన ఎదురింటి ఇల్లే. అదెప్పుడూ తన జట్టు ఉండేది కాదు. దాని జట్టు ఎవరికి కావాలి: కాని, అది ఏ పిల్లనీ తన జట్టుంద నిచ్చేది కాదు. చిన్నప్పటి నుంచీ దానిలో అతిశయం ఉంది. ఆ అతిశయమే పిల్లలందరి మీద పెత్తనం చెలాయించేది. దాని పెత్తనానికి పిల్లలంతా మంత్రించిన వాళ్ళలా లొంగిపోయేవాళ్ళు. అది తనతో ఆడేది కాదు. మరొకర్ని ఆడనిచ్చేది కాదు. తనను ఉడికిస్తున్నట్టుగా తన ముందే ఆడుకునేవాళ్ళు. తనకు అలా చూస్తూంటే ఆడాలనిపించీ, అభిమానం విడిచీ వాళ్ళ మధ్యకు వెళితే దబ్బున తోసేసేది రమణమ్మ ముండ.

ఆఖరికి తన చెల్లెలు కూడా రమణమ్మ పక్కే.

ఇప్పటికీ జానకికి దానితోనే స్నేహం.

అక్క తనలాంటి ఆడపిల్లేననీ, ఒకే వయసుదనీ, ఒకే రక్తం పంచుకు పుట్టినదనీ జానకికి జ్ఞానమే ఉంటే కబుర్లూ, తిరుగుళ్ళూ, నవ్వులూ, పువ్వులూ, ఆటలూ, పాటలూ, ఎప్పుడూ రమణమ్మతో కాకుండా అప్పుడప్పుడైనా అక్కతో జరిగేవి.

ఆడపిల్లతో అదే వయసుగల ఆడపిల్ల మనసు విప్పి మాట్లాడు కోవాలేగాని, రోజుకి ఇరవైనాలుగు గంటలు చాలవు. కబుర్లు చాలవు. ఆకలి. నిద్రా కలగవు. బాధలూ, బరువులూ గుర్తుకు రావు.

అందుచేత అలాంటి ఒక స్నేహితురాలైనా లేనందుకు, చెల్లెలు కూడా తనని ఖాతరు చేయనందుకు కుసుమకు ఏడుపొస్తుంది.

పోనీ చెల్లి తనని ఖాతరు చేయకపోతే పోనీ; అస్తమానం ఆ

వాళ్ళని వెదుకుతూ రమణమ్మ దగ్గరికే పరుగెట్టడం తను భరించలేక పోతుంది.

భరించలేక 'దానితో ఆడగద్దని నీకెన్నిసార్లు చెప్పాలే' అని మంద లిస్తే — 'నా ఇష్టం. నేను ఆడుకుంటాను. నీకెందుకా ఉడుకుమోత్తనం' అని ఎదురు చెప్పి దాని దగ్గరకు పరుగెడుతుంది.

'నాకు ఉడుకుమోత్తనమా?' కుసుమకు ఏడుపే వస్తుంది.

కుసుమ అంటే నారాయణమ్మకు అపరిమితమైన జాలి.

కుసుమ తల్లి కున్నంత వయసుంటుంది నారాయణమ్మకు.

నారాయణమ్మ కుసుమను చూసినప్పుడల్లా ఎంతో బాధ పడిపో తుంది. "ఎంచక్కా కుందనప్పు బొమ్మలా ఉన్న నీకు కాలులేకుండా చేయ డానికి ఆ భగవంతుడి కెలా మనసొప్పిందో" అని వాపోతుంది. అంత అన్యాయం చేసినందుకు దేవుణ్ణి శపిస్తుంది. అయినా నీకా దేవుడే దారి చూపించాలంటుంది. నీకు కాలే ఉంటే ఎంచక్కా మొగుడ్ని మూడుముళ్లూ వేయించుకొందువు, ఈపాటికి ముగ్గురు పిల్లల తల్లి వయ్యుందువు కదే, తల్లీ — అంటుంది.

నారాయణమ్మన్నా, నారాయణమ్మలా జాలి చూపించే వాళ్ళన్నా కుసుమకు తగని భయం.

ఎదుటి మనిషి జాలేసే పరిస్థితుల్లో ఉంటే జాలిపడ్డంలో తప్పు లేదు. కాని, ఆ జాలి ఆ ఎదుటి మనిషిని క్రుంగ దీసేదిగా ఉండకూడదు. పుండు పెడుతున్న బాధను మరచిపోదామన్న ప్రయత్నం చేస్తున్న వాడికి ఆ పుండుని గుర్తుచేసి, ఆ పుండుని రేపడం జాలా? అదే జాలైతే ఆ జాలి నాకొద్దు, నాయనా, వద్దు, వద్దు, వద్దు, తల్లీ, వద్దు, వద్దు.

నారాయణమ్మ తనని కుంటిదానిలా చూస్తుంది. రమణమ్మ తనని పురుగులా చూస్తుంది. కాని, తనని మనిషిలా చూసేవాళ్ళు కావాలి.

అటువంటివాళ్ళు ఈ మనుషుల ప్రపంచంలో ఒక్కరు — ఒక్కరు — ఒక్కరైనా లేరా? అంతా రమణమ్మలూ, నారాయణమ్మ లేనా? అనుకుంటుంటే కుసుమకు కన్నీళ్ళు వరదలా వస్తాయి.

తనకు పెళ్ళి కాదు. తనకు పెళ్ళి కాకపోతే జానకికి పెళ్ళి కాదు.

అది కుసుమకు నచ్చలేదు. తనవల్ల చెల్లెలికి పెళ్ళి చేయకుండా వుంచేయడం తనకెంత మాత్రమూ ఇష్టంలేదు. చెల్లెలయినా పెళ్ళిచేసుకుని సుఖపడితే చాలు.

అది రమణమ్మ దగ్గరి కెళ్ళడం ఇష్టంలేదుకాని, పెళ్ళి చేసుకొని మొగుడి దగ్గరి కెళ్ళడం తనకిష్టమే. కాని, నాన్న వీల్లేదంటున్నాడు.

'ముందు నా పెళ్ళిట! నన్నెవరు చేసుకుంటారు?'

మూడో పెళ్ళివాడు, ముసిలాడు, ఆఖరికి కుంటాడు కూడా చేసుకోడు ఈ కుంటిదాన్ని.

అందుకే అమ్మ చెల్లెలికి ఎంత చేసేద్దామన్నా, మొండిగా ఒప్పుకోడు నాన్న.

'నేను చస్తేగాని ఒప్పుకోడు.'

కాని, తనకు చావు రాదు. అలాగని బతకలేదు.

బతకలేక చస్తూంది. చస్తూ బతుకుతూంది.

తనకు పెళ్ళి కావాలని యింతగా మొండిపట్టు పడుతున్న తన తండ్రే ఒకనాడు ఏమన్నాడో గుర్తుంది. బాగా గుర్తుంది. కుసుమకు.

ఆ రోజు — నాన్న మంచం మీద నడుం వాల్చాడు. నిద్ర పోతున్నాడు కాబోలు.

అప్పుడు తనెందుకో ఇంట్లోకీ, పైకీ పచార్లు చేస్తూంది.

పాపం, తన శరీరాన్ని మోసే రెండు కర్రలూ నాదగా చేస్తున్న చప్పుడు పట్టని నిద్రకు భంగం కలిగించిందో, పట్టబోతున్న నిద్రకు భంగం కలిగించిందో తెయ్యిమని లేచాడు నాన్న.

"అలా టిక్కు టిక్కుమంటూ లోపలికీ, పైకీ తిరక్కపోతే ఏం? కాళ్ళు లేనిదానివి ఒక మూల పడుండగూడదూ? అబ్బ! నీవెందుకు పడుంటావే మమ్మల్ని తినేసేవరకూ!" అనేసే ముసుగుతన్నాడు మళ్ళీ.

ఇప్పుడు నిద్రపడుతూంది కాబోలు!

ఎంత నిద్రాభంగమైనా, తండ్రి అలా అనకూడదు. అన్నాక నిద్ర పట్టకూడదు.

అయితే, నిద్ర పట్టిందో లేదో ఆ భగవంతుడికే తెలియాలి.

పైకి ఏడవకుండా లోలోపల కుసుమ ఎంత ఏడిచిందో కూడా ఆ భగవంతుడికే తెలియాలి.

అమ్మకూడా అంతే.

తను పెద్ద ప్రోబ్లెమ్‌గా కనిపిస్తుందేమో అప్పుడప్పుడు. అమ్మ ఏడుపుతో, కోపంతో ముఖం చిట్లించుకుంటుంది. 'మేము ఏం పాపం చేసుకున్నామోగాని తల్లీ, మా ఖర్మకొద్ది దాపురించావే, అని నెత్తి కూడా కొట్టుకుంటుంది. (అలా తిట్టే అమ్మే, కాసేపు పోయాక ఏడుస్తూన్న కూతురు దగ్గరికొచ్చి కన్నీళ్ళు తుడిచి, తను కన్నీళ్ళు పెట్టుకోవడం అది వేరే సంగతి) ఆఖరికి తన తమ్ముడు — ఆ గుంటవెధవ — వాడుకూడా అంతే.

కనీసం చిన్నక్క దగ్గర భయపడ్డట్టుగాకూడా పెద్దక్క దగ్గర భయపడడు.

పెద్దక్క మాట వినడు. మాటకు విలువివ్వడు.

పెద్దక్క ఒళ్ళుమండి కసిరితే 'సొట్టదానా' అని వెక్కిరిస్తాడు. సొట్టగా నడుస్తూ మరీ వెక్కిరిస్తాడు.

అమ్మా, నాన్నా 'తప్పురా' అంటారు కాని, ఆ గుంటవెధవకి రెండంటించి బుద్ధి చెప్పరు కదా!

ఎలా చెపుతారు? వాడు ఒక్కగానొక్క ముద్దుల కొడుకు.

తనే ఎవరికీ అక్కర్లేని కుంటి కూతురు.

తమ్ముడు తనని వెక్కిరించినందుకు ఏడవదుకాని, అమ్మా, నాన్నా వాణ్ణి పెద్దగా మందలించకపోవడం వల్ల ఎవరో దిక్కుమాలిన దానిలా ఏడుస్తుంది.

తనని అందరూ ఏడిపించేవాళ్ళే.

అంతా అంతే. అందరూ అంతే. ఇంట్లోవాళ్ళూ వీధిలోవాళ్ళూ అందరూ అంతే.

తనని మనిషిగా చూడరు. ఇక ఈ బతుక్కి విముక్తి లేదు. బతుకుమీద ఆశ లేదు. బతుకుమీద మోజు లేదు. మోజు లేనందుకు చావు రాదు. అసలు చావాలనిపించటంలేదు. అంతే?

ఆశ :

బ్రతకాలని ఆశ. అంతరాంతరాల్లో ఏదో మూలను ఆశ: మిణుకు మిణుకుమంటూ ఏదో ఆశ: కొనవూపిరిలాంటి ఆశ :

సరిగా ఆ సమయంలో—వీర్రాజు ఆమె జీవితంలోకి ప్రవేశించాడు.

గిలగిల తన్నుకుంటున్న ఆమె ఆశకు ఊపిరి పోశాడు. బతుకు మీద మోజు, ప్రేమ, ఆరాటం, అనురాగం ఇత్యాదులు కలిగించాడు. ఆమె చీకటి బతుకులో వెన్నెల నింపాడు. ఆమె కన్నీళ్ళు తుడిచాడు. ఆమె ముఖంలో నవ్వు వెలిగించాడు. నీవూ అందర్లాంటి మనిషివే అన్నాడు.

వీర్రాజు చాలా అందమైనవాడు. చాలా డబ్బుగలవాడు. మంచి వయసులో వున్నాడు. ఇంకా చదువుకుంటున్నాడు. ఇంకా పెళ్ళికావలసిన వాడు. కుసుమకు మామయ్య అవుతాడు.

వీర్రాజు సొంత ఊరులో బి. యస్. సి. చదివి, వైజాగ్‌లో ఎమ్. ఎస్. సి. చదవడానికొచ్చాడు. మామయ్య యింటిలోదిగి, గుమాస్తా గిరి వెలగబెడుతున్న పూర్ పేద మామయ్యకు ట్రబులివ్వడం యిష్టంలేక మామయ్య ఇంట్లో ఉండమన్నా వుండక, ఫర్వాలేదని బొడ్డింకల తిండి తింటూ హాస్టల్లోనే వుంటున్నాడు.

కాని, ప్రతి ఆదివారం తప్పక మామయ్య ఇంటికి వస్తాడు.

వచ్చి టైమంతా కుసుమ కోసమే స్పేర్ చేస్తాడు. ఆ ఇంట్లో వీర్రాజు, కుసుమ వున్నంత క్లోజ్‌గా మరెవరూ వుండరు. అంత సరదాగా మరెవరూ ఉండరు.

కుసుమ దృష్టిలో వీర్రాజు రమణమ్మ కాదు, నారాయణమ్మ కాదు.

తనను మనిషిగా చూసే మనిషి. మనిషి కాదు, దేవుడు

ముళ్ళబాటలోంచి పూలబాటలోకి, కటిక చీకట్లోంచి హాయి హాయి వెలుగులోకి, నరకాతి నరకంలోంచి సుందరాతి సుందర స్వర్గంలోకి వచ్చినట్టుగా వుంది కుసుమకి.

జీవితమంతా అందంగా, ఆనందంగా, ఉత్సాహంగా, మల్లిక డోలికల్లో ఊగుతున్నట్టుగా వుంది కుసుమకి. కాని, అదేమిటో కుసుమకి ఏడుపు రావడం మానటంలేదు.

ఎందుచేత?

ఆ రోజు —

ఆ సాయంకాలం —

వీర్రాజు మామయ్య తనకు చీర తెచ్చాడు.

"నా కెందుకు, మామయ్యా? నాకు చీరలున్నాయిగా." అంది, చీరలో చిరుగుల్ని దాచేస్తూ.

"నాకు తెలుసులేవే, తీసుకో ముందు." కుసుమ చేతిలో వీర్రాజు బలాత్కారంగా చీర పెడుతూంటే కుసుమకు ఏడుపే వచ్చింది.

అవును. మామయ్యకంతా తెలుసు.

ఆ రోజు మామయ్య కూడా ఉన్నాడు.

నాన్న ఒక నేతచీర తెచ్చాడు. తెచ్చి చెల్లెలి కిచ్చాడు.

"అదేమిటండీ! తెస్తే రెండు తేలేకపోయారా? లేకపోతే పూర్తిగా తేవడం మానేయాలిగాని, ఒకటి తేవడమేమిటి?" అంది అమ్మ.

"ఇప్పుడు నీకు చీరల మోజేమిటే!"

"సరిపోయింది. నా మొహానికి అంత భాగ్యం కూడానా! నాక్కాదండీ. పెద్దదానికి."

"దానికా!"

అంటే కుంటిదానికా అనేగా!

అయితే, అతను తన తప్పు తెలుసుకున్నాడనీ, తెలుసుకొని లోలోపల బాధ పడుతున్నాడనీ భార్య ఏమాత్రమూ గ్రహించలేదు. గ్రహించడం అతని కిష్టంలేదు కూడా. భార్య ముందు తను దొరికిపోయి, లొంగిపోవడం చాలామంది భర్తలకు ఇష్టం వుండదు.

అందుచేత, సమర్థించుకునే ధోరణిలో అన్నాడు: "దానికెందుకే? అది ఇంట్లో వుండేదేగా! అదేం కట్టుకొని ఊరేగుతుందా ఏమిటి? జానకి తోటి ఆడపిల్లలతో తిరుగుతుందికదా — దానికి సరైన బట్టల్లేకపోతే బాధపడదటే?"

"అయితే పెద్దది బాధపడదంటారా?" కయ్‌మంది తల్లి.

తండ్రికి నిజంగానే చిరాకొచ్చింది.

"నా దగ్గర డబ్బులు గలగల కులకడంలేదే. నాతో వాదించక, వేధించక పో ఇక్కణ్ణుంచి." కసిరేశాడు.

అమ్మ సణుగుకుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

జానకి అప్పుడే చీర సింగారించేసి అద్దం ముందు చూచుకుం టూంది. సంబరంగా.

ఇదంతా తలుపు చాటునుంచి కుసుమ వింటూ, ఏడుస్తూందని తండ్రికి తెలిసి ఉంటే అంతేసి మాటలు అనకపోను.

అప్పుడే వీర్రాజు మామయ్య వెనకగా వచ్చి భుజంమీద చేయి వేశాడు. 'బాధ పడకు' అన్నట్టుగా భుజం నొక్కాడు. అందుకే మామయ్య చీర తెచ్చాడు.

అందుకే ఏడుపొస్తూంది.

తను వీర్రాజు తెచ్చిన చీర కట్టుకుంటే నాన్న ఏమీ అనలేదు, అమ్మ సంతోషించింది.

కాని, చెల్లెలు ఏడిచింది.

నాన్న తెచ్చిన చీరకన్నా ఈ చీరే బాగుందట ! ఈ చీరే కావా లట !

ఆశ !

'నేను చచ్చినా ఇవ్వను' అనుకుంది కుసుమ.

"పోనీ, ఇచ్చేయవే, నే తెచ్చింది తీసుకొని." నాన్న సిఫారసు.

"నీవు తెచ్చింది తీసుకోను. నా చీర యివ్వను.అంతే."

తండ్రి తన మాట విననందుకు గొణిగాడు.

'నీ వలా ఎంత గొణిగినా అంతే. నేను చీర ఇవ్వను కాక ఇవ్వను' అనుకుంది.

చెల్లెలు ఏడుస్తూనే ఉంది,

'నీ వలా ఎంత సింగుకొని ఏడ్చినా అంతే.' కసిగా అనుకుంది.

అంత కసిగా కుసుమ అన్నప్పటికీ, అనుకున్నప్పటికీ ఏడ్చేసింది. ఇంట్లో మూలకు పోయి కసితీరా ఏడ్చింది.

కుసుమకు ఏడ్చినప్పుడల్లా రమణమ్మ గుర్తుకొస్తుంది.

రమణమ్మ గుర్తుకు రావడంతో కుసుమ కన్నీళ్లు తుడుచుకుంది. కట్టుకున్న చీరను సర్దుకుంది.

అది ఈ కొత్త చీరలో తనని చూడాలి. చూడలేక కళ్ళు కుట్టుకోవాలి. బాగా ఉడికిపోయి చావాలి.

బయటకు వచ్చింది కుసుమ.

అప్పటికే ఎదురుగా, ఇంటి గుమ్మంలో రమణమ్మ ఉంది.

కుసుమ బయటకు రాగానే రమణమ్మ చూసింది. చూసి కళ్ళు కుట్టుకోలేదు. అసహ్యంతో ముఖం తిరుగుకు పోలేదు. ఉడికిపోలేదు.

కాని, పకపకా నవ్వింది; నవ్వుతూంది. ఆ నవ్వు 'ఓసి కుంటి ముండా ! నీ మొహానికి కొత్తచీరొకటా' అని ధ్వనిస్తున్నట్టుగా ఉంది.

అది కుసుమ ఊహించని పరిస్థితి.

అందుచేత కుసుమకు ఏడుపొచ్చేస్తూంది. ఏడుపు దానికి కనిపించకుండా గబగబా ఇంట్లోకెళ్ళిపోయింది.

ఇంట్లో కెళ్ళిపోయినా, దాని నవ్వు ప్రతిధ్వనిస్తూనేఉంది. ఆ నవ్వు భరించలేక గట్టిగా ఏడవక తప్పలేదు కుసుమకు.

ఎందుకు రమణమ్మ ముందు తను ఓడిపోతూంది ?

ఓడిపోతే ఏం ?

ఆ ఓటమికూడా తనకు తృప్తి నిస్తూంది. నిజమే.

ఒకవేళ పొరపాటున—రమణమ్మ తనను మనిషిగా చూడ్డం ప్రారంభిస్తే భరించలేదేమో ?

తను వీర్రాజుతో మాట్లాడుతున్నా, వీర్రాజుతో బయటకు షికారుకు వెళుతున్నా రమణమ్మ చూడలేదు. చూడలేక ఇంట్లోకి పోయి తలుపు ఠకాల్న వేస్తుంది.

అది చూడలేకపోయిన చూపూ, కసిగా తలుపులు వేసిన చప్పుడూ— వీర్రాజు తీసుకెళ్ళే షికారుకన్నా ఎక్కువ ఆనందమిస్తాయి కుసుమకు.

తనని మామయ్య ఒక్క షికార్లకు తీసుకెళ్ళడమే కాదు, బోలెడు వస్తువులు కూడా తెస్తాడు. పౌడర్లనీ, స్నోలనీ, తిలకంబుడ్లనీ, రిబ్బన్లనీ—

ఒకటేమిటి ఎన్నో తెస్తాడు. చెల్లెలికికూడా తెస్తాడు. దానికి తెస్తున్నాడంటే-తన ఒక్కదానికే తెస్తే ఉడికిపోయి ఏడుస్తుంది కాబట్టి.

ఒకసారి గాజులు తెచ్చి స్వయంగా తనకు తొడిగాడు. చెల్లెలికి తెచ్చాడుగాని, దాని కెందుకు తొడగలేదు ?

మామయ్య చేతుల్లోకి తన చేతులు తీసుకొని ఎంచక్కా గోళ్ళకు రంగు పూస్తాడు ! చెల్లెలు గోళ్ళు బాగుండవటనా గోళ్ళే బాగుంటాయట;

గాజులు తొడిగేటప్పుడూ, గోళ్ళకు రంగు వేసేటప్పుడూ—అదేమిటో తన చేతులు చలిచలిగా వణుకుతాయి.

వణికే చేతుల్లో రక్తం సలసల కాగుతుంది. చచ్చేటంత సిగ్గు వేస్తుంది.

ఎప్పుడూ లేనిది మామయ్యమీద ఒక రోజు కోపం వచ్చింది తనకు.

ఆ రోజు మామయ్యతనని జోళ్ళషాపుకి తీసుకువెళ్ళాడు.

షాపులో పనివాడు ఏమిటి కావాలని అడిగాడు.

"చెప్పులు" అన్నాడు వీర్రాజు.

వాడు చెప్పులు తీసి చూపించాడు.

వీర్రాజు నవ్వి, "నాక్కాదయ్యా, బాబూ, ఈ అమ్మాయికి" అన్నాడు.

వాడు అమ్మాయిని చూశాడా ?

లేదు. లేదు. వాడు చూసింది అమ్మాయిని కాదు.

రెండు కర్రల్లో వేలాడుతున్న కుంటిదాన్ని.

వాడు చూసిన చూపుకూడా అదే చూపు....అదే....అదే చూపు. రమణమ్మ చూసే చూపు.

"జత పూర్తిగా తీసుకోవాలని తమకు తెలుసనుకుంటాను." వాడు చాలా మర్యాదగానే అన్నాడు గాని, ఆ మాటలో హేళన లేదన్నవాణ్ణి తన కుంటికర్రలతో అక్కడికక్కడే చావగొట్టి తీరుతుంది కుసుమ !

కుసుమకు తల కొట్టేసి నట్టుగా ఉంది. కళ్ళంట నీరు రాకుండా బిగ తంటాలు పడుతోంది.

కుసుమకు వీర్రాజుమీద తెగ కోపం వచ్చింది. చెప్పులు కొంటానని తనతో ఒక ముక్క కూడా అనలేదు.

షాపులోకి వెళ్ళడం— ఆ వెధవ అనుకున్నట్టు— చెప్పులు మామయ్యకే అనుకుంది గాని తన కనుకోలేదు.

"తెలుసులేవోయ్—జతే తీసుకోవాలని" వీర్రాజు విసురుగానే అన్నాడు.

రమణమ్మగాడు బోలెడు చెప్పుల జతలు పడేశాడు.

"చూడు, కుసుం, నీకేది నచ్చిందో ?"

"నీకు నచ్చిందేదైయి, మామయ్యా !" ముందు ఈ చోటునుంచి వేగంగా పారిపోవాలి.

వీర్రాజు ఒక జత తీసి "ఇది నాకు నచ్చిం' దన్నాడు.

"నాకూ అదే నచ్చింది."

వీర్రాజు ఆ జతను పాక్ చేసి ఇమ్మన్నాడు రమణమ్మగాణ్ణి. ఈ లోగా ఆ చెప్పుల ఖరీదు పే చేసేశాడు వీర్రాజు.

పాక్ చేసిన జతను తీసుకొని షాపులోంచి బయటపడుతూంటే రమణమ్మగాడు వెనకగా వచ్చి "సార్ ! మిగతా చెప్పు ఏం చేస్తారు ?" అన్నాడు.

"ఆ చెప్పుతో నీ లాంటి వెధవల పళ్ళు రాలగొడతాను."

"అదేమిటి, సార్, అలాగంటారు ?" అన్నాడేగాని, లోపలికి పారి పోయాడు, జడిసిపోయి.

ఎలా ఊరడించాలో వీర్రాజు తెలీక--"క్షమించు, కుసుం" అని మాత్రం అన్నాడు.

అప్పు డామె పడ్డ బాధ, వేదన, దుఃఖం వర్ణించడం ఏ రచయితకీ సాధ్యం కానిది.

తనకీ ప్రపంచంలో వీర్రాజు ఒక్కడే బాలనుకుంటూంటే—తనని ఈ రమణమ్మలూ, నారాయణమ్మలూ జలగల్లా పీడించుకు తింటున్నారే గాని, వదలడం లేదు.

అసలు వీర్రాజులతోపాటు నారాయణమ్మలూ, రమణమ్మలూ ఉంటేనే ప్రపంచ మవుతుంది.

వట్టి వీర్రాజులే ఉంటే ప్రపంచమెలా అవుతుంది ? స్వర్గం గాని !

అందుచేత తను ఉన్నది ఈ ప్రపంచంలో కాబట్టి, స్వర్గం కాదు కాబట్టే నారాయణమ్మలీన్నీ, రమణమ్మలీన్నీ సాకుతూ, తాకుతూ శోక తప్పదు. ఆనందంతో పాటు బాధ తప్పదు.నవ్వుతో బాటు ఏడుపు తప్పదు.

కుసుమకు ఏడుపే వస్తూంది.

"కుసుమా ! నీకు సినిమాలంటే ఇష్టం లేదా?" అని వీర్రాజు అడిగి నప్పుడు కుసుమకు ఏడుపే వచ్చింది.

"ఎందు కిష్టం ఉండదూ !"

"మరెందు కెళ్ళవు ?"

"నన్నెవరు తీసుకెళతారు ?"

"నేను తీసుకెళతాను. సరేనా ?"

"ఈ కుంటిదాన్నా !"

"బాగుంది కుసుమా ! సినిమా చూసేది కాళ్ళా ? కళ్ళా ! పద, పద. బయలుదేరు."

ఏడుపొస్తూంది కుసుమకి.

అమ్మ నారాయణమ్మతో సినిమా కెళుతుంది. నాన్న డ్యూటీ నుంచే డైరెక్టుగా సినిమా కెళ్ళొచ్చేస్తాడు. చెల్లెలు ఆ వెధవముండ రమ ణమ్మతో వెళుతుంది. తమ్ముడు మారాం చేసి, ఏడ్చి మరి అమ్మతో సినిమా కెళ్ళగలుగుతాడు. కాని, నన్ను ఒక్కసారైనా తీసుకెళ్ళారా ? నాకు కాలు లేదుగాని, కళ్లు ఎందుకు లేవు ?

ఉగాది నాడు కాబోలు—అమ్మకు ఏం బుద్ధి పుట్టిందో, సినిమాకి నారాయణమ్మని కాకుండా తనని బయలుదేరమంది. తను రానంది. రానని ఏడ్చింది. ఎన్నాళ్ళకి కలిగింది దయ తల్లికి ! 'నేను రాను, తల్లీ, రాను.'

"అదేమిటే సినిమాకి రమ్మంటే ఏడుస్తావేమిటే ! సరి. సరి" అని అమ్మ నారాయణమ్మతో సినిమా కెళ్ళిపోయింది.

మళ్ళీ ఈ వేళ వీర్రాజు సినిమాకు బయలుదేరమంటే ఏడుపొస్తూంది. 'మామయ్యతో తప్పక వెళతాను.'

వీర్రాజు తన పక్కనున్నప్పటికీ రెండు కర్రలతో సినిమా హాల్లోకి ప్రవేశించినప్పుడు సిగ్గుతో క్రుంగిపోయింది.

"ఏం కాలంరా, బాబూ! కుంటాళ్ళకీ సినిమాయే" అన్నట్టు అందరూ చూస్తున్నారనిపించింది అంతా రమణమ్మలే అనిపించింది. అంతా నారాయణమ్మలే అనిపించింది.

దుఃఖం గొంతుక వరకూ వచ్చింది కుసుమకి.

కుసుమ రెండు కర్రలూ ఒక చేత్తో పట్టుకుని, స్ప్రింగు ఛెయిరు లాగి కూర్చోబోయి పడిపోయింది.

"ఆఁ ఆఁ" అన్నాయి చుట్టుపక్కల నారాయణమ్మలు.

వీర్రాజు కుసుమను లేవదీసి జాగ్రత్తగా కూర్చోబెట్టాడు. ఆమెకు మొదటే ఆ సదుపాయం చేయనందుకు బాధ పడ్డాడు.

కుసుమకు ఏడుపు ఆగటంలేదు. ఏడుపు అణుచుకోలేక పోతూంది.

చీకట్లో మునిగిపోవాలనుంది. ఆ చీకట్లో గొంతుకలో ఏడుపునంతా కక్కేయాలనుంది.

దీపాలు ఆరాయి.

కుసుమ చేతిలో రుమాలు తడిసింది.

పిక్చరు మొదలయ్యేటప్పటికి ఆమెకు కుదురుగా ఉంది.

కొంతసేపటికి సినిమా చక్కగా చూడగలుగుతూంది.

ఆమెకు సినిమా ఎంతగానో నచ్చుతుంది.

హీరో గుడ్డిదాన్ని పెళ్ళి చేసుకున్నాడు. గుడ్డిదాన్ని గుండెల కదుముకొని, 'నా ప్రాణం నీవు' అంటున్నాడు.

'నా కనులు నీవి' అని పాడుతున్నాడు. పాడుతూ, హంపీ శిలా వైభవం చూపిస్తున్నాడు. గుడ్డిది అతణ్ణి అతుక్కుపోయి అతని కళ్ళతో, అతని చేయూతతో ఆ శిలా వైభవాన్ని తిలకిస్తూంది.

కుసుమ గుండెలు గంటలు అయ్యాయి. గుండెల గంటలు గణగణ మోగాయి.

కుసుమ నయనాలు సజల నయనా లయ్యాయి.

తెర మసక ! మసక !

కుసుమ కళ్ళు తెరుచుకోలేదు.

తెరమీద - హీరో వీర్రాజు ! వీర్రాజు చేతిలో తను !

ఆమె చేతుల్లో కర్రలు లేవు. ఆ చేతులు వీర్రాజు మెడచుట్టూ ఉన్నాయి. వీర్రాజు చేతిలో తను తేలిపోతూంది....

కుసుమకు ఒళ్లు తిమ్మిరెక్కినట్టుగా ఉంది.

గుండె తేలికై పోతూంది. మనసు మొగ్గలేస్తూంది.

ఏదో చైతన్యం. ఏదో ఆవేశం.

కళ్ళలో నీళ్లు. పెదాలపై వణుకు.

కుసుమ చేయి వీర్రాజు చేతిమీదకు పాకింది....అలా.... అలా....

వీర్రాజు చేయి తియ్యలేదు.

"కుసుం !"

ఎంత తియ్యగా పిలుస్తాడు !

"నీవు హంపీ చూశావా ?" ఆమె చూసి ఉండదనిపించినా అలా అడిగేశాడు.

"భలేవాడివి, మామయ్యా ! నేను వైజాగ్‌లో పుట్టినా ఇంత వరకూ సముద్రాన్నే చూడలేదు, ఇక హంపీ ఒకటా నా మొహానికి !"

"అదిగో, అదే వద్దన్నాను. నీ మొహానికేం బంగారం !" అన్నాడు వీర్రాజు. అయితే, చూడు మరి. హంపీకేమోగాని, వైజాగ్‌లో చూడవలసినవి మటుకూ అన్నీ చూపించి పారేస్తాను. సరేనా ?"

కుసుమ గుండెల్లో వేయి నెమళ్ళ నృత్యం !

ఆనందం పట్టలేని ఆమె కళ్ళలో నీళ్ళు !

మామయ్యకు తనంటే ఎందుకంత అభిమానం ? ఎక్కడినుంచో ఇక్కడకు చదువుకోవడాని కొచ్చిన మామయ్యకు తనమీదెందు కంత ఇది ? ఈ కుంటి దానిమీద ఎందుకంత ఆదరణ ? ఆదరణకాదు, అను రాగం ! అపేక్ష ! ప్రేమ !

[illegible] అన్నమాట ప్రకారం వీర్రాజు కుసుమను వైజాగ్‌లో అందమైన ప్రదేశాలన్నీ అలిసిపోయేలా తిప్పాడు.

కాని ఆమెకు అలుపు రాలేదు. వీర్రాజు అండతో యారాడకొండ ఎక్కి దిగినప్పుడు అలుపు రాలేదు. అలాగే సింహాచలంకొండ ఎక్కి దిగినప్పుడు కూడా అలుపు రాలేదు. సీతమ్మధార, మాధవధార లాంటి [illegible], [illegible], భీమునిపట్నం లాంటి బీచిల్లోకి తెగ తిప్పిన [illegible] కూడా అలుపు రాలేదు. అంతులేని పరవశం చెందింది.

వీర్రాజు చూపించిన అందమైన ప్రపంచం చూసి పరవశించి పోయింది. ఆ ప్రపంచంలో అనంతమైన ప్రకృతి శోభను చూసి మురిసి పోయింది. [illegible] పడిపోయింది. అందులోపడి అంగవైకల్యాన్ని, [illegible] అల్లుకుపోయిన మనోక్లేశాన్ని, న్యూనతాభావాన్ని (ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్) మరిచిపోగలిగింది. ఆమెలో మనోవికాసం [illegible] స్థయిర్యం, ఆత్మబలం అంకురించాయి. 'నే నెందుకు బతకాలి' అన్న ప్రశ్న ఆమెకు కలగడంలేదు. కలిగినా, తీయని సమాధానం దొరుకుతుంది.

ఈ ప్రపంచం నన్ను మనిషిగా గుర్తించినా, గుర్తించకపోయినా జానేదేవ్. ఈ ప్రపంచంతో నాకు లెక్కలేదు. నాకు మామయ్య — నా పాలిట దేవుడు – సృష్టించిన ప్రపంచ ముంది. ఆ ప్రపంచంలో నారాయణమ్మలకు స్థానంలేదు. రమణమ్మల మాట ఎత్తేందుకు వీల్లేదు. ఆ ప్రపంచంలో నాకు కావలసిన శాంతి, సౌఖ్యం ఉన్నాయి. అందం, ఆనందం వున్నాయి. లేనిదంటూ లేదు. వీర్రాజు ప్రపంచంలో హాయిగా బతకేయగలను – అనుకోగలుగుతూంది.

వీర్రాజు తనకు ఏమి తెచ్చినా ఎక్కడకు తిప్పినా అమ్మా, నాన్నా ఏమీ అనుకోరు.

ఎందు కనుకోవడం ?

వీర్రాజు తెచ్చే వస్తువులూ, తీసుకువెళ్ళే ప్రదేశాలూ కుసుమకు అపురూపమైనవీ, మధురమైనవై తే, ఆ రోజు తెచ్చిన వస్తువు లన్నింటి కన్నా అత్యంత రూపమైనది, మృదు మధురమైనది.

ఆ వస్తువు వీర్రాజు కుసుమ పుట్టిన రోజుకి ప్రజెంటు చేసినది.

ఆ వస్తువు గంధపు చెక్కతో చేసిన చిన్న బొమ్మ.

రాధాకృష్ణుల బొమ్మ.

ఆ బొమ్మ ఆమె కెంతో నచ్చింది. అది వీర్రాజు ప్రజెంటు చేసినప్పుడు ఆమె హృదయం తను చూసిన సుందర దృశ్యాల్లో కెళ్ళి గంతులు వేసింది. తను ఎన్నడూ చూడని రమణీయ దృశ్యాల్లో కెళ్ళి చిందులు తొక్కింది. బృందావనంలో ఆ బహువల్లభుడు - ఆ శ్యామ సుందరుడు - ఆ ప్రేమారాధనా పరుడు శ్రీకృష్ణుడు తన పిల్లనగ్రోవితో మృదువుగా, మృదులంగా, మధురంగా, మంద్ర మంద్రంగా వినిపిస్తున్న ఆ సమ్మోహన భావపరంపర వీచికల తాకిడికి మ త్తిలి, మైమరచి, వివశ రాలై, నేలపై నిలువలేక ఆ విశ్వ మోహనుడి భుజస్కంధములపై వాలి పోయిన రాధ అదృష్టమే అదృష్టము కదా - అని చలించిపోయే కుసుమకు ఆ బొమ్మలు సజీవంగా కనిపిస్తాయి. ఆ పిల్లనగ్రోవిలో గానం శ్రావ్యంగా వినిపిస్తుంది.

ఆ బొమ్మ ఆమెకు అత్యంతానందం కలిగిస్తుంది ఆబొమ్మ ఆమెకు ఆరో ప్రాణం.

అందుకే ఆ బొమ్మ ఎప్పుడూ ఆమె చేతిలో ఉంటుంది.

వీర్రాజు తన సమక్షంలో ఉన్నా, లేక పోయినా ఆ బొమ్మ ఆమె చేతిలోనే ఉంటుంది.

వీర్రాజు తన సమక్షంలో అప్పుడప్పుడు మాత్రమే కాకుండా, ఎప్పుడూ, ఎల్లప్పుడూ ఉండిపోతే ఎంత బాగుండును! అనుకుంటుంది. పోనీ —'మామయ్యతోబాటు నేనూ చదువుకుంటే ఎంత బాగుండును!"

కాని, ఈ పేద దానికి అంత అదృష్టమా? కాని, ఆ అదృష్ట మంతా ఆ వెధవ ముండ రమణమ్మదే.

దాని అదృష్టాన్ని తను భరించలేదు. అది చదువుకోవడం తనకు పెద్ద బాధగా లేదు గాని, అది వీర్రాజు చదువుతున్న యూనివర్సిటీలోనే చదువుతుండడం భరించరాని బాధగా ఉంది.

అది వీర్రాజుని తనకి కాకుండా చేయాలని చూస్తూందని తెలుసు. వీర్రాజుని బుట్టలో వేసుకుని తనని ఎప్పటికీ మళ్లీ ఏడిపిద్దామనుకుంటూం దని తెలుసు. దాని ప్రయత్నాలు మట్టిపాలు అవుతాయని కూడా తెలుసు.

'ఉండవే, ఉండవే. నీ కోరలు తీసే సమయం ఆసన్నమయింది.

దాని కొంగుచాటున తను దాగుండాలి. తన బాగు చూడలేక అది కళ్లు కుట్టుకోవాలి. కళ్ళలో నిప్పులు పోసుకోవాలి. భగవాన్, ఆ రోజు ఎప్పుడో?

తను ప్రతి ఆదివారం సాయంకాలం వీర్రాజుతో బీచికి వెళుతుంటే దాని ముఖం మాడిపోతుంది. మాడిపోవడం కాదు, మసైపోవాలి.

అప్పుడు. కుసుమ ప్రతి ఆదివారం వీర్రాజుతో బీచికి వెళుతుంది. కుసుమ ఆ రాధాకృష్ణుల బొమ్మను కూడా తీసుకు వెళుతుంది. తను ఈ లోకాన్నే వదిలేయాలి గాని, ఆ బొమ్మను మటుకు వదలదు.

తెల్లటి ఇసుకలో వీర్రాజు పక్కన కూర్చుని— వీర్రాజు ఒళ్లు, శ్వాస వెచ్చగా తగులుతూండగా - ఆ డాల్ఫిన్స్ నోస్ కొండనీ, ఆకొండ మీద లైట్ హౌస్ చిమ్ముతున్న వెలుగునీ, సముద్రం - ఆకాశం కలిసే రేఖనీ, సముద్రంలో కెరటాల్నీ, కెరటాలు కక్కుతున్న నురుగుల్నీ— అలా చూస్తూ తనని తాను మైమరిచి పోతుంది. ఆ మైమరపులో వీర్రాజు భుజంమీదో, తొడమీదో వాలి పోతుంది.

కుసుమ బీచికి వెళుతున్నదే గాని, కుసుమకు సముద్రమంటే చచ్చే టంత భయం.

ఆమె భయపడుతుంటే వీర్రాజుకి భలే సరదాగా ఉంటుంది.

'వద్దు, బాబూ' అంటున్నా ఆమెను ఫోర్సు చేసి కెరటాల దగ్గ రకు — మరీ దగ్గరకు లాక్కు వెళతాడు.

ఒకసారి కుసుమ పెద్ద కెరటం ఊపు కాపుకోలేక దబ్బున పడిపో బోయింది.

పడిపోబోతున్న కుసుమను పడనివ్వకుండా వీర్రాజు చేతులు ఆమెను పట్టుకున్నాయి. పట్టుకున్న వీర్రాజు చేతులు ఆమెను కరకరా కాలు స్తున్నాయి.

"పడిపోతా ననుకున్నాను, బాబా!" అంది కుసుమ.

"నిన్నె పడనిస్తానా!" అన్నాడు వీర్రాజు.

కుసుమ గుండెలు పులకరించాయి. ఒడలు జలదరించింది. అంతలోనే — ఆమె గుండెలు బేజారై పోయాయి. ఒడలు కంపించిపోయింది.

ఎందుచేత?

ఆమె ఆరో ప్రాణం జారి పడిపోయింది. రాధాకృష్ణుల బొమ్మను సముద్రం లాక్కుంది.

అందుచేత కుసుమ ఏడ్చేస్తూంది.

"పోనీలే కుసుమా. అంతకన్న మంచి బొమ్మ కొనిస్తాను" అని వీర్రాజు ఎంత ఊరడించినప్పటికీ కుసుమ ఊరుకోలేదు. ఆ బొమ్మే కావాలంది. ఆ బొమ్మ లేకపోతే తను బతకలేనంది. కన్నీళ్ళు ఆపుకుంటూంది.

వీర్రాజు 'సరే' అన్నాడు. పాంటు మోకాళ్ళదాకా మడత పెట్టి సముద్రంలోకి దిగాడు. కెరటాల మీద ఆ బొమ్మ పెంకిగా, అల్లరిగా ఆడుతూ - వీర్రాజుకి — అందినట్టే అంది - అందకుండా వీర్రాజుని ఆడిస్తుంది. 'నీ అంతు చూసేదాకా వదలను' అనే పట్టుదలతో ఇంకా లోతుకు దిగుతున్నాడు వీర్రాజు.

లోతుకు దిగుతున్న వీర్రాజును చూసి కుసుమకు భయం వేసింది.

ఎలాగైతేనేం వీర్రాజు ఆ బొమ్మను పట్టుకో గలిగాడు.

కుసుమ హృదయంలో వేయి కుసుమాలు విరిశాయి.

తప్పిపోయిన బిడ్డ దొరికినతల్లిలా ఆ బొమ్మను గుండెలకు గట్టిగా అదుముకుంది కుసుమ.

మామయ్య తన కోసం ప్రాణాలు సైతం లెక్క చేయనందుకు తనకు ఆనందం, గర్వం కలిగాయి.

* * *

వీర్రాజు సన్నిధిలో కుసుమకు రోజులు క్షణాల్లా దొర్లిపోతున్నాయే గాని, వాస్తవానికి ఆ క్షణాలు రోజులై, రోజులు నెలలవగా, ఆ నెలలు ఏడాదిన్నర దాటింది. ఏడాదిన్నర మాత్రమే దాటింది.

ఆ ఏడాదిన్నర కాలంలో జరిగిన విశేషాలు :

ఒకటి — రమణమ్మ కుటుంబం ట్రాన్స్‌ఫర్ అయిపోయింది. ఇన్నాళ్ళూ పీడించుకు తింటున్న రమణమ్మ ఇక పీడించదంటూ పని ముందు నుంచి తగిలేసింది. ఆ దేవుడికే అని కొబ్బరికాయ కొట్టించుకుంది. కొబ్బరికాయ కొట్టాక కుసుమకు తెలిసిన విషయం — పైజాగుని రమణమ్మ కుటుంబం మాత్రమే వదిలి వెళ్ళిందనీ, రమణమ్మ పైజాగుని వదిలి వెళ్ళలేదనీ, కాస్తల్లో వుండి దమ్ము కంటిన్యూ చేస్తుందనీ — తెలుసుకొని బాధపడి, 'పోనీలే — పీడ మొత్తం పైజాగుని వదలకపోయినా, సగమన్నా వదిలేసింది. దానికి సంతోషం' అని తృప్తి పడింది.

రెండు — జానకికి రాక్ కట్నంతో పని లేకుండా మంచి సంబంధం వీర్రాజు తెచ్చాడు. అయితే ఈసారి కూడా కుసుమ తండ్రి తన లక్ష్యం వదలలేదు. కుసుమ ఉద్యోగం ఏదో దారి పట్టిన తరవాతనే జానకికి పెళ్ళి అన్నాడు. యథాప్రకారంగా కుసుమ తల్లికి ఒళ్ళు మండి పోయింది. ఈ పెళ్ళికి ఒప్పుకోకపోతే ఏ నుయ్యో, గొయ్యో చూసు కుంటానంది. కిరసనాయిలుతో తగలెట్టుకుంటానంది. సముద్రంలో కలిసి పోతానంది. అయినప్పటికీ ఆ తండ్రి తన లక్ష్యం నుంచి తొణకలేదు, బెణకలేదు. అయితే వీర్రాజు కుసుమ తల్లితండ్రులకు మాటిచ్చాడు— 'కుసుమకు దారి ఏర్పరిచే బాధ్యత నాది. సరేనా' అని. కుసుమ తల్లిదండ్రుల వదనాలు కృతజ్ఞతతో, కళ్ళు నీళ్ళతో మెరిశాయి. అందుచేత అంతవరకూ జానకికి పెళ్ళి వాయిదా పడినా వీర్రాజు తెచ్చిన సంబంధం వాళ్ళు (మంచి వాళ్ళు కాబట్టి) జానకికి పసుపు రాసి, వస్తువు పెట్టి తమ పిల్ల అనిపించు కున్నారు.

మూడు — కుసుమ టైపు లోయర్ పరీక్షకి కట్టింది. కాదు: వీర్రాజు పరీక్షకి కట్టించాడు. కుసుమకి ఇష్టం లేకపోయినా, వీర్రాజు మాట కొట్టేయలేక టైపు నేర్చుకుంటానంది. దీనివల్ల కొంత మెరుగైనా పాస్ అవుతుందనుకుంది. నేర్చుకుంది. పరీక్షకి కట్టింది. పాసయింది.

పాసయిన మరునాడే పేపరు అడ్వర్టయిజ్‌మెంటు చూసి, విజయ వాడలో ఏదో కంపెనీకి టైపిస్టు — కమ్ — క్లర్కు ఉద్యోగానికి అప్లికేషను

పెట్టించాడు. నిజానికి కుసుమ సంతకం మాత్రమే చేసింది గాని, అన్ని పనులూ వీర్రాజే చేసి అప్లికేషను పంపాడు.

కుసుమ సంతకం పెట్టడానికి కూడా ఒప్పుకోలేదు. "నాకు ఉద్యోగం చేయడం ఇష్టం లేదు మామయ్యా! వద్దు, మామయ్యా!" అంది.

"భలేదానివే! అప్పుడే ఉద్యోగం వచ్చేసినట్టే మాటాడేస్తున్నావే! ముందు రానియ్. తరవాత ఆలోచిద్దాం. అప్లయ్ చేయడంలో తప్పులేదు. నష్టం లేదు" అన్నాడు.

ఈ కాలంలో ఉద్యోగం రావడమంటే మాటలా? మజాకా?

కాని, మాయదారి ఉద్యోగం నిజంగానే వచ్చేసింది!

వచ్చేసి కుసుమ గుండెల్లో దడను కలిగించింది.

ఉద్యోగం వచ్చినట్టు కాగితం వచ్చిన రోజుకి సరిగ్గా ఏడాదిన్నర.

ఒరిజినల్ సర్టిఫికెట్లు పట్టుకొని, వారం రోజుల్లోపల డైరెక్టుగా జాయినింగుకే రమ్మని, లేడీస్‌కి హాస్టలు ఫెసిలిటీకూడా ఉందని—ఉందా కాగితంలో.

'పోనీలే. ఏదో విధంగా దాని బతుక్కి దారి ఏర్పడింది' అనుకున్నాడు తండ్రి. ఇక దానికి పెళ్ళి జరగడం అనేది జరగని పనని నిశ్చయానికొచ్చిన వాడై.

వీర్రాజైతే ఎగిరి గంతేశాడు.

కుసుమకు ఏడుపొచ్చింది మామయ్య కెందుకంత ఆనందం ?

"నేనీ ఉద్యోగం చేయను. విజయవాడ వెళ్ళను." అనేసింది కుసుమ.

"ఏం ?" అన్నారు అందరూ.

"ఏం అంటే ఏం చెప్పమంటావు ? నాకు ఇష్టం లేదంతే" అంది.

"నే వెళ్ళనంటే వెళ్ళను" అని ఏడ్చేసింది.

"బాగుందే ! ప్రతి దానికీ ఏడుపే. వెళ్ళనక్కర్లేదులే. నీ కిష్టం లేనప్పుడెందుకు ? ముందా ఏడుపు ఆపు" అని విసుక్కున్నాడు తండ్రి.

ఆ సాయంత్రం వీర్రాజు, కుసుమ బీచిలో కూర్చున్నారు. బీచి బీచంతా చాలా హడావిడిగా ఉంది. అందంగా హాయిగా, చల్లగా ఉంది. అందంగా సింగారించుకున్న సౌందర్యవతిలాగుంది బీచి.

వీర్రాజు, కుసుమ చాలా సేపు మాటా మంతీ లేకుండా నిశ్శబ్దంగా కూర్చున్నారు.

వీర్రాజు సముద్రం వైపు అలా చూస్తున్నాడు.

కుసుమ ఇసుకతో గూడు కడుతూంది. కాని, గూడు నిలబడనంటూంది !

కాసేపటికి కుసుమే అంది: "మామయ్యా! నీకు కోపం వచ్చిందా?"

"దేనికి ?"

"నేను ఉద్యోగానికి విజయవాడ వెళ్ళనందుకు."

"దానికి నా కెందుకు కోపం ? కాని, మీ నాన్న చాలా బాధ పడ్డాడు కుసుం ! నీకు ఉద్యోగం వచ్చిందనగానే – పర్వాలేదు నీకో దారి ఏర్పడిందనీ, జానకికి పెళ్ళికూడా చేసేయవచ్చుననీ అనుకున్న మీ నాన్న నీవు వెళ్ళననగానే చాలా బాధ పడ్డాడు."

"నాన్న గురించి కాదు, మామయ్యా ! నీ ఉద్దేశం. అడుగుతున్నాను. నేను ఉద్యోగం చేయడం నీకిష్టమేనా ?"

"నా కెందు కిష్టం కాదు ! నా కిష్టమవబట్టేగదా నేను ఉద్యోగానికి అప్లికేషన్ పెట్టించింది ?"

"అయితే, మామయ్యా, నేను ఉద్యోగాని కెళ్ళడం వల్ల నా బతుక్కొక దారి ఏర్పడినట్టేనంటావా ?"

"ఏర్పడినట్టే కదా కుసుం ? నీవు జీవితాంతం ఎవరిమీద ఆధారపడనక్కర్లేకుండా—నిశ్చింతగా నీ కాళ్ళ మీద నీవు నిలబడగలవు."

ఈ సారి కుసుమకు ఏడుపు రావడం లేదు. చిన్నగా నవ్వు వస్తూంది. కాని, భయంకరంగా, భీకరంగా ఉంది ఆ చప్పుడు లేని చిరునవ్వు.

"అంత దూరం వెళ్ళి ఉద్యోగం చేయాలంటే భయపడి వెళ్ళనంటున్నావు కదూ ? ఎంతైనా ఆడపిల్లవి కదా మరి ! పోనీలే. ఇక్కడే, వైజాగులోనే ట్రై చేద్దాం. సరేగాని, కుసుం, నల్లరాళ్ళపై కెరటాలు తిరగబడి నురుగులు కక్కుతూ చెదిరిపోవడం... చూడు, ఎంత అందంగా ఉందో ?"

నల్లరాళ్ళు సముద్రుడి చేతికి చిక్కుకుపోయి కొరడా దెబ్బలు తింటున్నట్టు దీనంగా ఏడుస్తున్నాయి. కెరటాలు వికృతంగా, అతి వికృతంగా ఉవ్వెత్తున లేచి పడుతున్నాయి. కెరటాలపై, నురుగు విషం తాగిన మనిషి కక్కుతున్న నురగలా ఉంది. డాల్ఫిన్స్‌నోస్ కొండ నీటిరాక్షసిలా ఉంది. సముద్రమంతా కొన్ని కోట్ల నిర్భాగ్యుల కన్నీటి వెల్లువలా ఉంది (కన్నీరు కూడా ఉప్పగానే ఉంటుంది). సముద్రం భీకరంగా, దారుణంగా, ఘోరంగా, దీనంగా గర్జిస్తూంది. సముద్రంపై ముసురు మేఘాలు విషాదపు నీడల్లా ఉన్నాయి.

"మామయ్యా !"

"ఏం, కుసుమా ?"

"నేనొకటి అడుగుతాను. చెబుతావా ?"

"నీ వడిగితే ఏది చెప్పలేను ?"

"మామయ్యా ! నీవు ఇంతవరకూ...."

"ఏమిటి ఇంతవరకూ !"

"ఎవర్నీ ప్రేమించలేదా ?"

"అయ్యబాబోయ్ ! ఒక్కసారిగా అంత ఘాటు ప్రశ్నే !"

"చెప్పు, మామయ్యా, ఎవర్నీ ప్రేమించలేదా ?"

"చెప్పాలంటావా ?"

"చెప్పకూడదా ?"

"చెప్పకూడదనికాదు. సిగ్గేస్తోంది. నీ వడగకపోయినా, ఇన్నాళ్ళూ చెప్పాలనే అనుకుంటున్నాను. కాని, సిగ్గుతెర చెప్పనీయడం లేదు. అయినా, చూచాయగా నేనెవర్ని ప్రేమిస్తున్నదీ నీకు తెలిసే ఉండాలి."

"బాగుంది, మామయ్యా! నీవు చెప్పకుండా నా కెలా తెలుస్తుంది?"

"నీకు తెలిసిన పిల్లే కాబట్టి !"

"నాకు తెలిసిన పిల్లా ! ఎవరు, మామయ్యా, ఆ పిల్ల ?"

"రమణమ్మ !"

ర....మ....ణ....మ్మ ! ? !

* * *

మరునాటి రోజు వీర్రాజు కుసుమ ఇంటికి వచ్చాడు. కాని, కుసుమ కనపడలేదు.

"అక్కయ్యా! కుసుమ ఏదీ? కనపడదేం!" అనడిగాడు కుసుమ తల్లిని.

"ఇంకేం కనిపిస్తుంది, బాబూ! విజయవాడ వెళ్ళిపోయింది"

"ఆఁ! నాకేమీ చెప్పలేదే!"

"ఏమిటో, బాబూ! అదో పిచ్చి మాలోకం. అదాక్షణంలో ఏమనుకుంటుందో తెలీదు. మరుక్షణంలో ఏం చేస్తుందో తెలీదు. నిన్న ఇవ్వాళా వెళ్ళనన్నదామె. ఈ రోజు వాళ్ళ నాన్నని ఒకటే గోల చేసింది—ఇవ్వాళా వెళ్ళిపోతాననీ, విజయవాడ దిగబెట్టమనీ, తెల్లారిందగ్గర్నుంచీ వెళ్ళిపోతానని ఒకటే ఏడుపు."

"అయితే, ఎప్పుడెళ్ళిపోయింది?"

"ఇప్పుడే, బాబూ, ఇంకా అరగంటవ్వదు."

వీర్రాజు స్టేషను కెళదామని దౌడు తీయబోతూ, టేబులు మీద ఒక వస్తువును చూసి ఆగిపోయాడు.

అది కుసుమ ఆరో ప్రాణం, కుసుమకు అత్యంత అపురూపమైన రాధాకృష్ణుల బొమ్మ. వీర్రాజు ఇచ్చిన గంధపుబొమ్మ. ఎప్పుడూ కుసుమ వెంటనే కుసుమ చేతుల్లోనే ఉండే బొమ్మ.

వీర్రాజు ఆ బొమ్మను పట్టుకొని పరుగెట్టాడు స్టేషనుకి.

కాని, ట్రెయిన్ అప్పటికే వెళ్ళిపోయింది.

వీర్రాజు ఉస్సూరంటూ నిట్టూర్చాడు.